సాక్షి
మహబూబాబాద్
మంగళవారం । 25 । మార్చి । 2025



నిబంధనలు నీళ్ల'పాలు'

అధికారుల అనాలోచిత నిర్ణయాలు, నిర్లక్ష్యం కారణంగా విజయ డెయిరీ పాల అమ్మకాలు తగ్గుముఖం పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. - 8లో



రైతు ఉత్పత్తుల మేళాకు సర్వంసిద్ధం

వరంగల్ నక్కలపల్లి రహదారిలోని జీఎం కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేయనున్న రైతు ఉత్పత్తుల మేళా నేటి నుంచి ప్రారంభం కానుంది. - 8లో

గరిష్టం/కనిష్టం
38.6⁰ /23.1⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలిగా ఉంటుంది.



రేపు కమిషనర్‌తో ఫోన్ ఇన్



డోర్నకల్: సాక్షి ఆధ్వర్యంలో రేపు(బుధవారం) డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్‌తో 'ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలో **తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి లైట్లు, కుక్కలు, కోతుల బెడద** తదితర సమస్యలపై ఫోన్‌చేసి కమిషనర్‌తో మాట్లాడవచ్చు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. సమస్యలను ఈ కింద ఇచ్చిన సెల్ ఫోన్ నంబర్లకు కాల్ చేసి తెలియజేయాలి.

తేది : 26-03-2025, బుధవారం
ఫోన్ చేయాల్సిన నంబర్లు:
9390121800, 9705346405
సమయం : ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు

న్యూస్‌రీల్

నేడు వీరభద్రస్వామి హుండీ లెక్కింపు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి హుండీలను నేడు(మంగళవారం) లెక్కిస్తామని ఆలయ ఈఓ సత్యనారాయణ సోమవారం తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 26నుంచి ఈనెల 24వ తేదీ వరకు భక్తులు సమర్పించుకున్న కానుకలను లెక్కిస్తామన్నారు. ఆలయ అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

'పది' పరీక్ష కేంద్రం పరిశీలన



బయ్యారం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని డీఈఓ రవీందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డీఈఓ వెంట గార్ల –బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి, ఎంఈఓ దేవేంద్రాచారి తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

- డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు



తొర్రూరు: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని, అవకతవకలకు చోటు ఇవ్వవద్దని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై ప్రజా వేదిక కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ పూర్ణచందర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా వేదికలో 2023–24లో మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఉపాధి పనుల్లో అవకతవకలు గుర్తించిన అధికారులు రూ.1.62 లక్షల రికవరీకి ఆదేశించారు. 29 గ్రామాలకు సంబంధించిన ఈజీఎస్ సిబ్బంది ఉపాధిహామీ పనులకు సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. పలు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు జాబ్‌కార్డులు, నో డిమాండ్, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేయకపోవడం, మస్టర్ల వద్ద సంతకాలు తీసుకోకపోవడం వంటివి బహిర్గతమయ్యాయి. డీఆర్‌డీఓ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరిగితే ఉపేక్షించబోమన్నారు. జాబ్ కార్డు కలిగిన పేదలకు ఉపాధి పని చూపించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు మధు,పార్థసారథి, అంబుడ్స్‌మెన్ ఆడమ్, సిబ్బంది పుష్పలత, సురేంద్ర, చెన్నకేశవులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



- 'పక్షవాతంలో ఉన్న దంపతులు మరిపెడ మండలం బావోజీగూడెం గ్రామానికి చెందిన దిగజర్ల అంతయ్య–సుమతి. ఉద్యానశాఖ అధికారుల సూచన మేరకు గ్రామంలో తమకు ఉన్న చెలకలో డ్రాగన్ ఫ్రూట్ తోట సాగు చేశారు. ఇందు కోసం రూ. 3.75లక్షల ప్రోత్సాహాన్ని ఉపాధి హామీ జాబ్ కార్డు ద్వారా చెల్లిస్తారు. కాగా అధికారులు చెప్పిన విధంగా ఆ దంపతులు చేనులోనే పనిచేశారు. మస్టర్ వేయమని ఫీల్డ్ అసిస్టెంట్ వద్దకు వెళ్లారు. పని మొత్తం పూర్తయిన తర్వాత వేస్తామని చెప్పారు. ఈక్రమంలో ఏపీఓ, ఎంపీడీఓ వద్దకు వెళ్లినా మస్టర్ వేయలేదు. ఈమేరకు ఈనెల 3వ తేదీన, 10న, 12న, 17న గ్రీవెన్స్, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరిగినా లాభం లేకపోయింది. పనిచేసి పైసలు అడిగితే పట్టించుకునే వారు కరువయ్యారని వారు వాపోయారు.'

తీరని సమస్య..

గ్రీవెన్స్‌లో ఇచ్చిన దరఖాస్తులపై నిర్లక్ష్యం

- పట్టించుకోని కిందిస్థాయి అధికారులు
- మళ్లీ రండీ అంటూ సమాధానం
- పదే పదే ప్రజావాణికి వస్తున్న బాధితులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు

సాక్షి, మహబూబాబాద్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వినతులు అందజేస్తున్నామని, అయితే సమస్యలు పరిష్కారం కావడం లేదని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. గ్రీవెన్స్‌లో కలెక్టర్, ఇతర అధికారులకు ఇచ్చిన వినతులపై కిందిస్థాయి అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. మరికొందరు గ్రీవెన్స్ దరఖాస్తులు అంటేనే చిన్నచూపు చూస్తున్నారని, రేపు రాపో.. మాపురాపో అని వాయిదా వేస్తున్నారే తప్ప సమస్య పరిష్కరించడం లేదని చెబుతున్నారు. ఒక వేళ దరఖాస్తును పరిశీలించినా.. ఇళ్ల స్థలాలు, భూవివాదాలు,పెండింగ్‌బిల్లుల విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో ప్రజావాణిలో వినతులు అందజేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశలు సన్నగిల్లుతున్నాయని కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఒకప్పుడు సోమవారం వచ్చిందంటే కలెక్టరేట్ దరఖాస్తుదారులతో కిక్కిరిసిపోయేది. ఇప్పుడు గతంలో వచ్చిన దరఖాస్తుల్లో మూడోవంతు కూడా రావడం లేదు.

వినతులు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- ప్రజావాణిలో 84 వినతులు

మహబూబాబాద్: ప్రజావాణి దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మాచారి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ వినతులను కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అనే విషయాన్ని గమనించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలను తనిఖీ చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతీఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కాగా ప్రజావాణిలో 84 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులచే ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్, అదనపు కలెక్టర్లు సందర్శించారు. జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీసీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ హరిప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ బీమ్లానాయక్, డీవీహెచ్‌ఓ డాక్టర్ కిరణ్‌కుమార్, డీడబ్ల్యూఓ ధనమ్మ, సివిల్ సప్లయీస్ మేనేజర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేయాలి



నా కుమారుడు 8 సంవత్సరాలుగా మంచానికే పరిమితమయ్యాడు. చిన్న తనంలోనే మెదడుకు సంబంధించిన వ్యాధితో కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. మానసికంగా కూడా దివ్యాంగుడే, సదరం క్యాంపులో సర్టిఫికెట్ తీసుకుని దరఖాస్తు చేసినప్పటికీ.. నేటికీ దివ్యాంగ పింఛన్ రావడం లేదు. వెంటనే మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశా.

– పూజ, దివ్యాంగుడు కీర్తన్‌జాయి తల్లి, ఎడ్జర్ల, మరిపెడ మండలం

రైతుల పడిగాపులు





మార్కెట్ ప్రధాన ద్వారం వద్ద వేచిఉన్న మిర్చి బస్తాల వాహనాలు, యార్డులో మిర్చి బస్తాలు

మిర్చి బస్తాలతో నిండిన మానుకోట మార్కెట్

- కొనుగోళ్లలో తీవ్ర జాప్యం.. రెండురోజులు నిరీక్షణ
- పట్టించుకోని అధికారులు

మహబూబాబాద్ రూరల్: ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. మార్కెట్‌లో పంటను అమ్ముకోవడానికి కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిర్చి అధికంగా రావడంతో రెండుమూడు రోజులు పడిగాపులు పడి విక్రయించాల్సిన దుస్థితి మానుకోట వ్యవసాయ మార్కెట్‌లో నెలకొంది.

అధికంగా రాక..

ప్రస్తుత సీజన్‌లో మానుకోట వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి అధికంగా వస్తోంది. దీంతో మార్కెట్ ఆవరణలోని ఎనిమిది షెడ్ల నిండా మిర్చి బస్తాలు ఉంటున్నాయి. దీంతో కవర్ షెడ్‌లో అపరాలను రాశులుగా పోసుకుని రైతులు విక్రయించుకుంటున్నారు. కాగా రోజుకు 6 నుంచి 7వేల బస్తాల వరకు మాత్రమే కొనుగోలు చేసేందుకు మార్కెట్ ఆవరణలో స్థలం ఉండగా.. అంతకుమించి మిర్చి బస్తాలు వస్తున్నాయి. దీంతో పలువురు రైతుల వాహనాలను మార్కెట్ బయటే నిలిపి ఉంచుతున్నారు. మార్కెట్ ఆవరణలోని మిర్చి బస్తాల కొనుగోలు చేసి కాంటాలు పూర్తయ్యాక కోల్డ్ స్టోరేజీలు, లేదా గోదాములకు తరలించిన తర్వాతే బయట ఉన్న వాహనాలను మార్కెట్‌లోకి అనుమతిస్తున్నారు. నిత్యం ఇదే తంతు కొనసాగుతుందని మార్కెట్ పాలకవర్గం, అధికారులు స్పందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. సరుకులు తీసుకొచ్చిన రోజే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

6,736 బస్తాల మిర్చి కొనుగోళ్లు..

రైతులు శని,ఆదివారాలు సుమారు 15 వేల వరకు మిర్చి బస్తాలను విక్రయానికి మార్కెట్‌కు తీసుకురాగా.. సోమవారం 6,736 బస్తాలను వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇందులో 6,349 బస్తాలు తేజ రకం, 387బస్తాల తాలు రకం మిర్చి కొనుగోలు చేశారు. తేజరకం మిర్చి క్వింటా గరిష్ట ధర రూ.13,469 పలుకగా.. మోడల్ ధర రూ.1,3050, కనిష్ట ధర రూ.10,010 పలికింది. తాలు రకం మిర్చి క్వింటా గరిష్ట ధర రూ.5,715 పలకగా మోడల్ ధర రూ.5,300, కనిష్ట ధర రూ.4,725 పలికింది.

రెండు రోజులైనా టోకెన్లు ఇవ్వలేదు



నేను 13 బస్తాల తేజ రకం మిర్చి, ఒక బస్తా తాలు రకం మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చా. రెండు రోజులైనా రైతులకు టోకెన్లు ఇవ్వలేదు. అసలే పంట దిగుబడిరాక, ఆపై మిర్చి ధరలు తగ్గి అవస్థలు పడుతుంటే మార్కెట్ యార్డులోనూ రైతులకు పడిగాపులు తప్పడంలేదు.

– బానోత్ వీరన్న, రైతు, చిన్నకిష్టాపురం

దశలవారీగా టోకెన్లు ఇస్తున్నాం..




మార్కెట్ యార్డులో స్థలం కొరత అతిపెద్ద సమస్యగా మారడంతో మిర్చి కొనుగోళ్ల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. షెడ్లలో ఉన్న మిర్చి కొనుగోళ్లు పూర్తికాగానే దశలవారీగా రైతులకు టోకెన్లు ఇచ్చి విక్రయాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మిర్చి అధికంగా వచ్చినప్పుడు మాత్రమే కొంత జాప్యం జరుగుతుంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రైతులకు అండగా ఉంటున్నాం.

– ఇస్లావత్ సుధాకర్, మార్కెట్ చైర్మన్

సైబర్ మోసం

- ఎలాంటి లింక్‌లు, ఓటీపీలు చెప్పకుండానే ఖాతాలు ఖాళీ
- లబోదిబోమంటున్న బాధితులు






మైనస్‌లోకి వెళ్లిన వసుమతి సేవింగ్ ఖాతా

కొత్తగూడ: సైబర్ నేరగాళ్ల పెట్రేగిపోతున్నారు. నిత్యం ఏదో ఒకచోట సైబర్ మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఏజెన్సీవాసుల ఖాతాలను కొల్లగొడుతున్నారు. విషయం తెలుసుకున్న బాధితులు బ్యాంకుల వద్దకు వెళ్తే అధికారులు సరైన సమాధానం చెప్పడంలేదని వాపోతున్నారు. నెల రోజుల్లో ముగ్గురు బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయం కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

మైనస్‌లోకి బ్యాలెన్స్..

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బానోతు వసుమతికి మహబూబాబాద్‌లోని ఎస్‌బీఐలో సేవింగ్ అకౌంట్ ఉంది. అందులో రూ.36వేల నిల్వ ఉంది. అయితే తన అవసరాలకు యూపీఐ పేమెంట్ చేస్తే కాలేదు. బ్యాంకు బ్యాలెన్స్ చెక్‌చేస్తే రూ.42,605 మైనస్ చూపించింది. ఈమేరకు బ్యాంకు అధికారులను సంప్రదించగా.. సైబర్ మోసగాళ్ల పని అయి ఉంటుందని మేనేజర్ వెంటనే తన పైఅధికారులకు, సైబర్ క్రైమ్ పోలీసులకు తెలిపారు. అలాగే మండల కేంద్రంలోని బట్టల షాపు యజమానికి చెందిన రూ.7వేలు, మరో వ్యక్తికి చెందిన రూ.90వేలు బ్యాంకు ఖాతాల నుంచి మాయమైనట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై కుశకుమార్, ఇండియన్ బ్యాంకు మేనేజర్ నరేశ్ బ్యాంకు ఖాతాదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సెల్ ఫోన్‌కు వచ్చే లింకులను, మెసేజ్‌లను క్లిక్ చేయవద్దని, అపరిచిత ఫోన్‌కాల్స్ మాట్లాడవద్దని అవగాహన కల్పించారు. బ్యాంకులో డబ్బు పోయినట్లు తెలిసిన వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.


ఎలాంటి లింకులు క్లిక్ చేయలేదు



ఫోన్‌లో ఎలాంటి లింకులను క్లిక్ చేయలేదు. అయినా నా అకౌంట్‌లో ఉన్న రూ.36వేలు పోయి.. మైనస్ రూ. 42వేలు చూపిస్తుంది. మైనస్ గమనించక అకౌంట్‌లో డబ్బు ఉందని యూపీఐ పేమెంట్ చేస్తే కాలేదు. ఇది గమనించి శని, ఆది వారాలు సెలవులు రావడంతో సోమవారం బ్యాంకులో సంప్రదిస్తే సైబర్ మోసం అని తెలిసింది. నాకు న్యాయం చేసి ఆదుకోవాలి.

– బానోతు వసుమతి, బాధితురాలు

నా అకౌంట్‌లో రూ.7వేలు మాయమయ్యాయి..



ఇండియన్ బ్యాంకులో నా అకౌంట్ నుంచి రూ.7వేలు మాయమయ్యాయి. ఎవరికీ ఓటీపీలు చెప్పలేదు.. లింకులు క్లిక్ చేయలేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమంటున్నారు. ఇలా అయితే సామాన్యులు, చదువురాని వారు బ్యాంకులో డబ్బులు వేసుకోవాలంటే భయపడాల్సి వస్తోంది.

– జాడి సారయ్య, బాధితుడు

ప్రజల ముందుకు జాబితా

ప్రతీ గ్రామంలోని మూడు కూడళ్లలో రుణమాఫీ లబ్ధిదారుల వివరాల ప్రదర్శన

- ఫ్లెక్సీల తయారీ ప్రదర్శనకు టెండర్లు పిలిచిన వ్యవసాయ శాఖ
- ఉగాది నాటికి ప్రదర్శించాలని నిర్ణయం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.96,89,400 రుణమాఫీ



జిల్లాల వారీగా రుణమాఫీ (రూ.లలో)	
హనుమకొండ	16,11,750
వరంగల్	23,80,350
ములుగు	7,95,900
మహబూబాబాద్	20,08,650
జనగామ	17,96,550
జేఎస్ భూపాలపల్లి	10,96,200
రైతుభరోసా జమ (రూ.లలో)	
హనుమకొండ	44,37,300
వరంగల్	71,77,800
ములుగు	24,21,300
మహబూబాబాద్	6,44,175
జనగామ	55,36,650
జేఎస్ భూపాలపల్లి	35,43,750

హన్మకొండ: ప్రజలకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేసిందో చెప్పుకోవాలని నిర్ణయించింది. ప్రతీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమం, పథకాలను ప్రజల ముందుంచనుంది. ఈ మేరకు ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రూ.2లక్షల రుణమాఫీ, రైతుభరోసా లబ్ధిదారుల జాబితాను గ్రామాల్లో ప్రదర్శించాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం రూ.లక్షలోపు రుణం మాఫీ చేయగా అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ చేసింది. ఈ ఘనతను ప్రజల ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోచనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయ శాఖ రుణమాఫీ లబ్ధిదారుల జాబితాతో ఫ్లెక్సీలు రూపొందించనుంది. ఈ మేరకు జిల్లాల వారీగా జిల్లా వ్యవసాయాధికారులు ఫ్లెక్సీల ప్రింటింగ్, ప్రదర్శనకు టెండర్లు పిలిచారు. ప్రతీ గ్రామంలో మూడు ముఖ్య కూడళ్లలో లబ్ధిదారుల జాబితాతో ముద్రించిన ఫ్లెక్సీలను ప్రదర్శిస్తారు. దీంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా లబ్ధిదారుల వివరాలు కూడా ప్రదర్శించాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు నాలుగు ఎకరాల వరకు రైతు భరోసాను ప్రభుత్వం విడుదల చేసింది. ఉగాది పండుగ నాటికి గ్రామాల్లో రుణమాఫీ, రైతు భరోసా లబ్ధిదారుల వివరాలతో కూడిన ఫ్లెక్సీలు కళకళలాడనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ.2 లక్షలలోపు రుణాలు రూ.96,89,400లు మాఫీ అయింది. రైతు భరోసా రైతుల ఖాతాలో జమ చేస్తున్న క్రమంలో ఫ్లెక్సీ ప్రింటిగ్ నాటికి ఎంత మందికి ఎంత మొత్తంలో జమ చేసిన మేరకు జాబితాను ప్రదర్శించనున్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం 1,47,970మంది రైతులకు రూ.154,23,04,019 జమ చేయాల్సి ఉంది. ఈ నెల 23 వరకు నాలుగు ఎకరాల వరకు భూమి కలిగిన 1,18,348 రైతుల ఖాతాల్లో రూ.90,29,09,744 జమ చేశారు.

విమర్శలను తిప్పికొట్టేందుకేనా..

సర్కారు రుణమాఫీ సరిగా చేయలేదని విపక్షాలు విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి. యాసంగి సాగు పూర్తయి, పంటలు చేతికి వచ్చే సమయం వచ్చినా పూర్తిస్థాయిలో రైతు భరోసా ఇవ్వలేదని ఎండగడుతున్నాయి. ఈ క్రమంలో వారి విమర్శలు తిప్పికొట్టేలా నేరుగా రుణమాఫీ, రైతు భరోసా లబ్ధిదారుల జాబితాను బహిరంగంగా గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో ప్రదర్శించి వారి నోర్లు మూయించాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది. ఏ రైతుకు ఎంత రుణమాఫీ జరిగింది, ఎంత రైతు భరోసా వచ్చిందన్న వివరాలతో కూడిన జాబితాను గ్రామాల్లో ప్రదర్శించడం ద్వారా తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నంగా తెలుస్తోంది. తద్వారా గ్రామ పంచాయతీ, మండల, జిల్లా ప్రాదేశిక ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఆలోచన ఇందులో దాగి ఉందనే చర్చ కూడా సాగుతోంది.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూసెంటర్: సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు పట్టణంలో నాలుగు కొత్త ట్రాన్స్ ఫార్మ ర్లు ఏర్పాటు చేశామని డీఈ పి.విజయ్ అన్నారు. 'సాక్షి' దిన పత్రికలో సోమవారం 'వెక్కిరిస్తున్న ఖాళీలు' 'నిరుపయోగంగా ఉన్న సబ్ స్టేషన్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు జిల్లా కేంద్రంలోని నందినగర్, రాహుల్‌గనర్, సుందరయ్యనగర్, గుండ్లకుంటలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ... వేసవికాలం దృష్ట్యా అధిక లోడ్, లో ఓల్టేజ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి ముందస్తుగానే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లన్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ వినియోగం, పొదుపు, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912లో సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ సీహెచ్.ప్రశాంత్, ఏఈ సంగీత, సబ్‌ఇంజనీర్ రామకృష్ణ, విద్యుత్ సిబ్బంది రాంబాబు, స్వామి, శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న డీఈ విజయ్

క్షయవ్యాధి నియంత్రణకు కృషి

నెహ్రూసెంటర్: క్షయవ్యాధి (టీబీ) నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ మురళీధర్, డీపీఓ హరిప్రసాద్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ప్రపంచ టీబీ నియంత్రణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదకరమైన అంటువ్యాధి క్షయను అంతం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బంది వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి త్వరగా ఈ వ్యాధి సోకుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 1,287 కేసులు ఉన్నాయని, వారందరిని గుర్తించి చికిత్స అందజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు వ్యాధులు వ్యాప్తి కాకుండా అవగాహన కల్పించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని వారు సూచించారు.

బాధితులకు అండగా పోలీసులు

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: మహిళలపై జరిగే నేరాలను పూర్తిగా అరికట్టేందుకు షీ టీమ్స్, మహిళా పోలీస్‌స్టేషన్ కీలకపాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. షీ టీమ్స్ కార్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్‌ను సోమవారం సందర్శించి, మహిళా భద్రత, హక్కుల పరిరక్షణ, కేసుల ప్రగతి మొదలైన అంశాలపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. కాలేజీలు, కార్యాలయాలు, బస్టాండ్లు, పబ్లిక్ ప్రాంతాల్లో మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, వేధింపుల ఆపరేషన్ల గురించి ఆర్ఎస్సై సునందను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళల భద్రతకు సంబంధించి హెల్ప్ లైన్ నంబర్లను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. నేర నివేదికలు, పెండింగ్ కేసులు, బాధితులకు అందిస్తున్న సహాయం, కౌన్సెలింగ్ సేవలు, స్టేషన్‌లో మహిళా సిబ్బంది సంఖ్య గురించి తెలుసుకున్నారు. బాధిత మహిళలతో మాట్లాడి వారికి పోలీసు శాఖ నుంచి అందించాల్సిన సహాయంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. పోక్సో, గృహహింస, వేధింపుల కేసుల్లో బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ చంద్రమౌళి, రూరల్ సీఐ సరవయ్య, ఎస్సై దీపిక, ఆర్ఎస్సై సునంద, ఎస్సై ఆనందం, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్కెట్‌కు 16 టన్నుల మామిడి



వరంగల్: వరంగల్ ఏనుమాముల పరిధిలోని ముసలమ్మకుంట సమీపంలో ఏర్పాటు చేసిన మార్కెట్‌కు 21 వాహనాల్లో 16 టన్నుల మామిడి అమ్మకానికి వచ్చింది. గరిష్ట ధర క్వింటాకు రూ.10వేలు, కనిష్ట ధర రూ.2వేలు (రాలిన కాయలు), మోడల్ ధర రూ.6,700 పలికినట్లు ఉద్యోగులు తెలిపారు.

దారి తవ్వకంతో రాకపోకలకు అంతరాయం

మామిడి మార్కెట్‌కు వెళ్లే దారిని ఆ స్థల యాజమానులు తవ్వడంతో రైతులు, వ్యాపారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఈవిషయం తెలిసిన మార్కెట్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని స్థలానికి సంబంధించిన పత్రాలు తీసుకురావాలని పేర్కొనడంతో స్థల యజమానులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి యార్డులో వ్యాపారిపై హమాలీ చేయి చేసుకున్నట్లు తెలిసింది. ఈవిషయంపై వ్యాపార వర్గాలను విచారించగా దాట వేశారు.

నాట్యాచార్యులు సుధీర్‌రావుకు జాతీయస్థాయి ఫెలోషిప్



హన్మకొండ కల్చరల్ : నగరానికి చెందిన నాట్యాచార్యులు, సద్గురు శివానంద నృత్యమాల వ్యవస్థాపకుడు బొంపల్లి సుధీర్‌రావు కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ నుంచి జాతీయస్థాయి సీనియర్ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు. ఇప్పటి వరకు వెయ్యి మందికి పైగా అత్యుత్తమ నాట్యకళాకారులను తీర్చిదిద్దిన సుధీర్‌రావు జిల్లాకు అవార్డులు తేవడం ప్రారంభించారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

వరంగల్ క్రైం: తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సుబేదారి పోలీసులు అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల వినయ్‌కుమార్, భద్రాది కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపేట మండలం అనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన తంబళ్ల నితిన్ తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. బంగారు ఆభరణాలు, నగదు చోరీకి పాల్పడుతున్నారు. ఈనెల 19న సంతోశ్‌నగర్ కాలనీలో విజయగిరి రాజు తన ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లగా తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా, స్థానిక ఇంటెలిజెన్స్‌ను వినియోగించుకుని సోమవారం అదాలత్ వద్ద నిందితులను గుర్తించి విచారించగా.. నేరం ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రూ.1.70 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ. 90 వేలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

ST. FRANCIS E/M SCHOOL
Vill & Mdl. Velair, Hanmakonda Dist - 506142
WANTED TEACHERS
- Pre-Primary Teachers
- Primary - (Hindi, Maths, Science & Social)
- High School - (Hindi, Maths, Science & Social)
- PET • Computer Teacher
Send Your Resume to - 6304958915
ADMISSIONS OPEN FOR 2025-26
NURSARY TO 8th CLASS

WANTED
Wanted JEE / NEET / EAPCET - Lecturers, Incharges / Wardens Male / Female in Following Subjects
• SANSKRIT - 2 • ENGLISH - 2 • MATHS - 4 • PHYSICS - 3
• CHEMISTRY - 2 • BOTNAY - 2 • ZOOLOGY - 2 • COMMERCE - 1
• ECONOMICS - 1 • CIVICS - 1 • COMPUTER OPERATORS
• Incharges - 3 (Male), 3 (Female) • Wardens - 6 (Male), 6 (Female)
Date of Interview : 25th & 28th March 2025, Timings : 10 AM to 5 PM
PLACE OF INTERVIEW AND DEMO
KALOJI JUNIOR COLLEGE
Chinthagattu Camp Back Side, Hanamkonda
Contact: 9989139100, 9502133661

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

FINANCE
■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1265067]

WANTED
■ Wanted Telecallers in Education Sector. Salary 10,000/- Full time & Part time 5,000/- Incentives are 10,000/- per Admission. Cont: 9908432153, 7288826032. [WA-6571]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ సాయిరామ్ హోంకేర్ : Hydలో బేబీ కేర్, పేషెంట్ కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు/నర్సులు ఇంటిపని / వంటపనికి మనుషులు (ఆడ/మగ) కావలెను. జీ: 18 వేలు. 9949094607, 9908454607 [SCA25002181]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'విజయ'కు డిస్ట్రిబ్యూటర్ బకాయిలు రూ.40 లక్షలు?

- ఏ రోజు డబ్బు అదే రోజు చెల్లించాలనే నిబంధనలకు పాతర
- పొంతనలేని అమ్మకాల లెక్కలు
- విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..
- డెయిరీ అధికారుల తీరుపై అనుమానాలు

నిబంధనలు నీళ్లపాలు..



హన్మకొండ చౌరస్తా : ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ నిర్వహణపై రోజురోజుకూ నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రైవేట్ డెయిరీల పోటీని తట్టుకుని.. పాల అమ్మకాలు పెంచేందుకు అధికారులు చేపట్టిన చర్యలు ఫలితాలు ఇవ్వకపోగా.. నష్టాలు తెచ్చిపెడుతున్నాయి. అధికారుల అనాలోచిత నిర్ణయాలు, నిర్లక్ష్యం కారణంగా పాల అమ్మకాలు తగ్గుముఖం పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయ పాలను ప్రజలకు మరింత చేరువచేసి అమ్మకాలు పెంచాలనే ఉద్దేశంతో గతేడాది నవంబర్‌లో డిస్ట్రిబ్యూటర్‌కు అప్పగించారు. నిబంధనల ప్రకారం వరంగల్ యూనిట్ పరిధిలో రోజుకు 10 వేల లీటర్ల పాల అమ్మకాలు చేసేందుకు డిస్ట్రిబ్యూటర్‌కు డెయిరీ అనుమతులు ఇచ్చింది. అయితే రెండు రోజుల అమ్మకాల మొత్తాన్ని ముందే చెల్లించేలా (కాషన్ డిపాజిట్) రూ.15 లక్షలు చెల్లించాలని షరతులు విధించింది. కాగా, రూ. 15 లక్షలు డిపాజిట్ చేసిన సదరు డిస్ట్రిబ్యూటర్.. నిబంధనల ప్రకారం ఏ రోజు అమ్మకాలకు సంబంధించిన మొత్తం (డబ్బు) చెల్లించాల్సి ఉన్నప్పటికీ తన ఇష్టానుసారంగా చెల్లిస్తూ ప్రస్తుతం డెయిరీ రూ.40 లక్షలు బకాయి ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

డిస్ట్రిబ్యూటర్‌కు అనధికారికంగా సాయం..

డెయిరీకి ఏ రోజు డబ్బులు అదే రోజు చెల్లించాల్సి ఉండగా రోజుల తరబడి బకాయిలు పేరుకుపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. రోజు చెల్లిస్తున్నట్లు డిస్ట్రిబ్యూటర్‌కు అనధికారికంగా డెయిరీ అధికారుల్లో కొందరు సాయం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పొంతన లేని లెక్కలు చూపెడుతూ ఉన్నతస్థాయి అధికారులను సైతం పక్కదోవపట్టిస్తున్నారనే ఆరోపణలు డెయిరీ వర్గాల నుంచే వినిపిస్తున్నాయి.

లాభాలు గడిస్తున్నా బకాయిలు చెల్లించడం లేదు..

ఒక్కో లీటర్ పై డిస్ట్రిబ్యూటర్‌కు రూ. 8 చెల్లిస్తున్నామని డెయిరీ అధికారులు చెబుతున్నప్పటికీ అధికారికంగా రూ.10.50 పైసలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. రోజుకు 10వేల లీటర్ల పాలు విక్రయిస్తున్న డిస్ట్రిబ్యూటర్ లాభాలను గడిస్తున్నప్పటికీ డెయిరీకి చెల్లించాల్సిన లక్షలాది రూపాయలు పెండింగ్‌లో పెడుతూ సంస్థకు నష్టాలు చవిచూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు చోద్యం చూస్తుండడం పై పాడి రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. డిస్ట్రిబ్యూటర్ పాల అమ్మకాలపై పూర్తిస్థాయి విజిలెన్స్ విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు, అవినీతి బయటపడుతుందని పాడిరైతులు పేర్కొంటున్నారు.

బకాయిలు లేవు



డెయిరీ నిబంధనల ప్రకారం డిస్ట్రిబ్యూటర్ నుంచి రెండు రోజులకు సంబంధించిన అమ్మకాల మొత్తం విలువ రూ.12 లక్షలు సెక్యూరిటీ డిపాజిట్ చేసుకున్నాం. డిస్ట్రిబ్యూటర్ ద్వారా ప్రతీ రోజు 240 ప్రభుత్వ సంస్థలు, సివిల్ మార్కెట్ కలుపుకుని 10వేల లీటర్ల అమ్మకాలు జరుగుతున్నాయి. నిబంధనల మేరకు డిస్ట్రిబ్యూటర్ ఏరోజు చెల్లించాల్సిన డబ్బులను అదే రోజు చెల్లిస్తున్నాడు. ఇప్పటి వరకు డిస్ట్రిబ్యూటర్ నుంచి ఎలాంటి బకాయిలు లేవు.

- శ్రవణ్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్, విజయ డెయిరీ, వరంగల్

రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంట్‌కు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్ : వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ జిల్లా స్థాయిలో ఈనెల 22, 23 తేదీల్లో కాకతీయ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' అనే అంశంపై ప్రసంగ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి యూత్‌పార్లమెంట్‌కు ఎంపిక చేసినట్లు కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో హనుమకొండ, ములుగు, ఏటూరునాగారం, భూపాలపల్లి జిల్లాల నుంచి వివిధ డిగ్రీ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొని తమకు ఇచ్చిన సమయం ప్రకారం ప్రసంగించారు. ఇందులో పదిమందిని రాష్ట్రస్థాయి యూత్‌పార్లమెంట్ ఎంపిక చేశారు. అందులో బి.సంధ్య బైరెడ్డి, ఎం. శ్రావ్య, శ్రీజయాదవ్, కాలాజ్ఞ (కేయూ బయోటెక్నాలజీ), మహ్మద్ హాసన్ (యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీ, హనుమకొండ), ఎం. శ్రావ్య, కార్తీక్ (కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కాలేజీ), ఎ.వినీలా (ప్రభుత్వ పింగిళి మహిళా కాలేజీ హనుమకొండ), అలేఖ్య, సిద్దార్థ (వరంగల్ కిట్స్ కాలేజీ), రచన (ములుగు ప్రభుత్వడిగ్రీ కాలేజీ), శంకర్ (భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీకాలేజీ) ఉన్నారు. వీరు రాష్ట్ర అసెంబ్లీలో జరగబోయే స్టేట్‌లెవ్ వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనబోతున్నారు. ఈనెల 23న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మాక్ పార్లమెంట్ కూడా నిర్వహించుకున్నారు. ఈ యూత్‌పార్లమెంట్ పోటీల సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, ప్రిన్సిపాల్ టి. మనోహర్, నెహ్రూ యువకేంద్రం జిల్లా డిప్యూటీ ఆఫీసర్ అన్వేశ్, ఈ ప్రోగ్రాం కన్వీనర్ రాధిక, జ్యూరీ మెంబర్, కేయూ జూవాలజీ విభాగం ఆచార్యుడు మామిడాల ఇస్తారి పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఆర్థికంగా ఎదగాలి

- మామునూరు కేవీకే కోఆర్డినేటర్ రాజన్న



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ రాజన్న

మామునూరు : చేప పిల్లల పెంపకంతోపాటు చేప పిల్లల ఉత్పత్తికేంద్రాలు, నర్సరీలు ఏర్పాటు చేసుకుని గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళా రైతులు ఆర్థికంగా ఎదగాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, హైదరాబాద్ సౌజన్యంతో నర్సరీల్లో తెల చేపల పెంపకంపై ఐదు రోజుల శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత మహిళలు, నిరుద్యోగ యువత ముందుకు వచ్చి నర్సరీల్లో చేపల పంపకం చేపడితే లాభాలు అర్జించొచ్చని పేర్కొన్నారు. అనంతరం చేపల పెంపకం, చేపలు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. శాస్త్రవేత్తలు జె.సాయి కిరణ్, గణేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి దేవాలయ భూమిపై వివాదం

- కబ్జా చేశారని స్థానికులు కలెక్టర్‌కు.. చేయలేదని మరోవర్గం పీఎస్‌లో ఫిర్యాదు



మహంకాళి ఆలయం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని మహంకాళి దేవాలయ భూమిపై వివాదం నెలకొంది. కబ్జాకు గురైన ఆలయ భూమిని స్వాధీనం చేసుకుని హద్దులు నిర్ధారించాలని స్థానికులు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, తమ భూమిలో నిర్మాణాలు చేపట్టడానికి యత్నిస్తుండగా కొంతమంది అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వల్లాల జగన్ అనే వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఫిర్యాదుపై విచారణ జరుపుతామన్నారు. వివరాలు ఉన్నాయి. మండల కేంద్రంలో పురాతన మహంకాళి ఆలయం ఉంది. గతంలో ఈ ఆలయంలో అమ్మవారికి దీపదూప నైవేద్యాలు సమర్పించేవారు. ఆ తర్వాత కొన్నేళ్ల పాటు అలయం పూజలకు నోచుకోలేదు. ఇదే అవకాశంగా భావించిన ఆలయం పక్క ఉన్న జగన్ సోదరులు ఇక్కడ కట్టెల మండీ ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెప్పారు. ఇది కొన్నాళ్లు కొనసాగుతూ వచ్చింది. అయితే ఆరేళ్ల క్రితం స్థానిక పద్మశాలి సేవా సంఘం మహంకాళి ఆలయం ఉన్నట్లు వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో జగన్‌కు స్థానికుల మధ్య వివాదం నెలకొంది. ఈ విషయంలో అప్పుడు కార్పొరేటర్‌గా పనిచేసిన నాగమళ్ల ఝాన్సీ భర్త నాగమళ్ల సురేశ్ ఇరువురితో మాట్లాడి సమస్యను సద్దుమణిగించారు. అయితే వారం రోజులుగా మళ్లీ వివాదం తెరపైకి వచ్చింది. ఇటీవల స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ పంచాయితీ చేశారు. అది కొలిక్కి రాలేదు. చివరికి పంచాయితీ వాయిదా పడింది. కాగా, సోమవారం స్థానికులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేయగా, జగన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

'స్టేషన్' ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా రామనరసింహారావు

కాజీపేట అర్బన్ : స్టేషన్ ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా రామనరసింహారావును నియమిస్తూ జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కాగా, ఈనెల 20వ తేదీన ఏసీబీ దాడుల్లో పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ రామక్రిష్ణ స్థానంలో వరంగల్ ఆర్వోలో జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న రామనరసింహారావును ఇన్‌చార్జ్‌గా నియమించగా సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు తెలిసింది. వరంగల్ ఆర్వో రికార్డులో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ నస్రీన్‌ను సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యూటేషన్ ఉత్తర్వులు జారీ చేయడంతో జాయింట్-2గా కొనసాగే అవకాశం ఉంది. జాయింట్-2గా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ జాయింట్-1 బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న స్టేషన్ ఘన్‌పూర్, వరంగల్ ఆర్వోలో పరిస్థితులు ఎలా ఉంటాయే అంటూ కార్యాలయంలో చర్చించుకోవడం గమనార్హం.

మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదని..

- క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు



గోపి మృతదేహం

దేవరుప్పుల : మద్యం తాగడానికి డబ్బు అడగగా భార్య నిరాకరించడంతో క్షణికావేశానికి గురైన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన దేవరుప్పుల మండలం సీతారాంపురంలో చోటుచేసుకుంది. ఎస్సై ఊర సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన బత్తుల గోపి (27) కుటుంబంతో జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాంపురం గ్రామానికి వలస వచ్చాడు. ఇక్కడ సమీప బంధువైన బత్తుల రామకృష్ణకు చెందిన ఇటుక బట్టీలో నాలుగు నెలల నుంచి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం మద్యం కోసం రూ.200 కావాలని భార్యను అడగగా నిరాకరించింది. దీంతో ఆమెతో గొడవపడ్డారు. క్షణికావేశంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి తల్లి వెంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మూలమలుపు వద్ద బైక్ సడెన్ బ్రేక్..

- కాల్వలో ఎగిరి పడి యువకుడి మృతి
- పాకాల- నర్సంపేట ప్రధాన రహదారిపై ఘటన

నర్సంపేట రూరల్ : మూలములుపు ద్విచక్రవాహనం సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక కూర్చున్న ఓ యువకుడు అదుపు తప్పి కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన నర్సంపేట మండలంలో రాజుపేట శివారులోని పాకాల- నర్సంపేట ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. నర్సంపేట రూరల్ ఎస్సై అరుణ్ కుమార్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండలానికి చెందిన దారం సత్యనారాయణ, రేణుక దంపతుల కుమారుడు వికాస్ (22) నర్సంపేట మండలం ముగ్దుంపురం గ్రామంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్‌ఈ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి నర్సంపేట నుంచి ఖానాపురం మండలం పాకాల వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో నెక్కొండ మండలం చంద్రుగొండకు చెందిన ఎర్రబోతుల రాజు ద్విచక్రవాహనం నడుపుతుండగా వికాస్ వెనుక కూర్చున్నాడు. ఈ క్రమంలో పాకాల - నర్సంపేట ప్రధాన రహదారి మూలమలుపు వద్దకు రాగానే సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక కూర్చున్న వికాస్ ఎగిరి పక్కనే ఉన్న కాల్వలో పడ్డాడు. స్థానికులు గమనించి వికాస్‌ను కాల్వ నుంచి బయటకు తీసి 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. నర్సంపేట రూరల్ ఎస్సై అరుణ్ కుమార్ ఘటనా స్థలిని పరిశీలించి మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.

రైతు ఉత్పత్తుల మేళాకు సర్వం సిద్ధం

నేటి నుంచి ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహణ

- వరంగల్ నక్కలపల్లి రోడ్డులోని జీఎం కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు
- 42 స్టాళ్లపై గృహ, వంటగది అవసరాలు, ఆరోగ్యకర అల్పాహారాలు, తదితర ఉత్పత్తుల ప్రదర్శన
- మేళా ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ సత్యశారద



మేళా ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

ఖిలా వరంగల్: వరంగల్ నక్కలపల్లి రహదారిలోని జీఎం కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేయనున్న రైతు ఉత్పత్తుల మేళా ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల నేతృత్వంలో మంగళవారం నుంచి 27వ తేదీ వరకు మేళా జరగనుంది. జిల్లాలోని రైతులు ఉత్పత్తి చేసిన గృహ, వంటగది అవసరాలు, ఆరోగ్యకర ఆల్పాహారాలు, అందం, ఆరోగ్య సంరక్షణ.. ఇలామరెన్నో ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు జిల్లాలోని ప్రజలందరినీ మేళాకు ఆహ్వానిస్తున్నారు. సహజ సిద్ధమైన, మేలైన ఉత్పత్తులను ఆసక్తి ఉన్న ప్రజలు కొనుగోలు చేసేందుకు 42 స్టాళ్లు ఏర్పాటు చేశారు. రైతులు తాము ఉత్పత్తి చేసిన వస్తువులను మేళా ద్వారా అధిక రాబడి పొందడానికి స్టాళ్లలో విక్రయించుకునే అవకాశం కల్పించారు. ప్రజలకు ఆయా ఉత్పత్తులపై అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వ అందించే ప్రోత్సాహకాలను అధికారులు వివరించనున్నారు. వ్యవసాయ సాగుకు ఉపయోగపడే అన్ని రకాలు పరికరాలు, పనిముట్లు ప్రదర్శనలో ఉంచనున్నారు. వీటిలో ప్రధానంగా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవడం, సాంకేతిక పరిజ్ఞానం పొందడం, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సస్య రక్షణ మందులు, పంట రుణాలు పొందేందుకు అవగాహన కల్పించనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

రైతు ఉత్పత్తుల మేళా ఏర్పాట్లను కలెక్టర్ సత్యశారద సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి అనురాధతో కలిసి పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ఉత్పత్తులపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఏసీపీ తిరుపతి, ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఏఓ రవీందర్‌రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

వరంగల్: వరంగల్ నక్కలపల్లి రోడ్డులోని జీఎం కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 25నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్న 'తెలంగాణ రాష్ట్ర స్థాయి రైతు ఉత్పత్తిదారు సంఘాల మేళా'ను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా వ్యవసాయధికారి కె.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మేళాలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన 40 రైతు ఉత్పత్తిదారు సంఘాల ఉత్పత్తులను స్టాళ్లలో ప్రదర్శించడంతోపాటు అమ్మకాలు చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సైకిళ్లపై దేశ పర్యటన



యువకులను అభినందిస్తున్న యోగా గురువులు

హన్మకొండ చౌరస్తా: వాహన కాలుష్యంపై అవగాహన కల్పించేందుకు కొత్తగూడెం యువకులు పండు రాథోడ్, రాజు సైకిళ్ల పై దేశ పర్యటనకు బయలుదేరారు. ఖమ్మం నుంచి బయలుదేరిన యువకులు సోమవారం వరంగల్‌కు చేరుకుని ఖిలావరంగల్, భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయాలను దర్శించుకున్నారు. యువకులను యోగా గురువు శ్రీనివాస్, వేణుశర్మ సన్మానించారు. కాలుష్య నివారణకు యువకులు చేపట్టిన సాహోసోపేత కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.

కాలానికి అనువైన పంటలు ఎంచుకోవాలి

- జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు బలరామ్



సదస్సులో మాట్లాడుతున్న బలరామ్

వైరా: రైతులు ఎప్పటికప్పుడు కాలానికి అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని.. తద్వారా నష్టం లేకుండా అధిక దిగుబడులు సాధించొచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఎం.బలరామ్ తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన మధ్య తెలంగాణ మండల (ఉమ్మడి ఖమ్మం, వరంగల్, మెదక్) వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా సంఘం సమావేశంలో పాల్గొన్నారు. తొలుత రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం బలరామ్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు, మార్కెట్‌లో డిమాండ్‌ను తెలుసుకుంటూ పంటల సాగులో మెళకువలు పాటిస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. అనంతరం యూనివర్సిటీ విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎం.యాదాద్రి, మధ్య తెలంగాణ రీజియన్ సహాయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి, మధిర వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్లు, వివిధ విభాగాల ప్రధాన శాస్త్రవేత్తలు, ఉమ్మడి ఖమ్మం, మెదక్, వరంగల్ జిల్లాల వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో 'టూడీ'కి స్వస్తి..

ఆస్పత్రిలో ఎకో సేవలు నిలిపివేత.. కేఎంసీకి తరలింపు

- వారానికి రెండు రోజులు మాత్రమే పరీక్షలు
- ఇక్కడ కూడా మధ్యాహ్నం తరువాత సేవలు నిలిపివేత
- చేసేదేమిలేక ప్రైవేట్‌కు తరలుతున్న పేద రోగులు



సాంకేతిక లోపాలతో కొనసాగుతున్న ఈసీజీ పరికరం

ఎంజీఎం : ఎంజీఎం.. ఉత్తర తెలంగాణకు గుండె. పేదలకు పెద్ది దిక్కు. ఇంతటి ఘన కీర్తి కలిగిన ఈ ఆస్పత్రిలో రోజురోజూకూ సేవలు క్షీణించిపోతున్నాయి. నాలుగు ఉమ్మడి జిల్లాలు, కొత్తగా ఏర్పడిన పది జిల్లాలకు చెందిన రోగులు ఆపత్కాళంలో ఎంజీఎంకు వస్తారు. ఇలాంటి ఆస్పత్రిపై దృష్టి సారించాల్సిన రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఆస్పత్రి పాలనపై దృష్టి సారించకపోవడంతో వామ్మో ఎంజీఎం ఆస్పత్రా అనే విధంగా తయారైంది పరిస్థితి. ఆస్పత్రి విభాగాధిపతులు వారాని రెండు రోజులు విధులకు హాజరవుతున్నారు. వచ్చినా రోజు రెండు, మూడు గంటల పాటు మాత్రమే విధులు నిర్వర్తించడంతో ఒక్కొక్క విభాగం మూత పడుతూ వస్తోంది. ఈ క్రమంలో ఆస్పత్రిలో అత్యంత కీలకమైన కార్డియాలజీ విభాగం సేవలు పూర్తి అధ్వానంగా తయారయ్యాయి. ఈసీజీ పరికరాల్లో సాంకేతిక లోపాలు, ఏకంగా 24 గంటల పాటు అత్యవసర సేవలు అందించాల్సిన టూడీ ఎకో పరీక్షల పరికరాలను కేఎంసీ తరలించారు. నామామాత్రపు విధులు నిర్వర్తిస్తూ ఎంజీఎంలో టూడీ ఎకో సేవలు బంద్ చేశారు. నిత్యం అందించాల్సిన టూడీ ఎకో సేవలకు స్వస్తి పలికి రెండు, మూడు రోజులకోమారు ఓ ప్రత్యేక అంబులెన్స్‌లో 20 మంది, 30 మందిని తరలిస్తూ నామామాత్రపు సేవలందిస్తూ పేద రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

శస్త్రచికిత్సల్లో టూడీ ఎకో సేవలు కీలకం..

ఎంజీఎంలో అన్ని విభాగాల్లో నిర్వహించే శస్త్రచికిత్సల్లో ఈసీజీ, టూడీ ఎకో నివేదికలు కీలకం. ఆస్పత్రిలో రోజూ 10 నుంచి 20 శస్త్రచికిత్సలను నిర్వహిస్తుంటారు. ఇలాంటి సేవలను నిలిపివేసి కేఎంసీలోని సూపర్ ఆస్పత్రికి పరిమితి చేసి విధులకు ఏగనామం పెట్టి ప్రైవేట్ కేంద్రాలతో కుమ్మక్కు అయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి విభాగాలను పర్యవేక్షించే విభాగాధిపతులు విధులకు ఏగనామం పెడుతున్నారు. వారానికి రెండు రోజులు విధులు నిర్వర్తించడం వల్ల ఇలాంటి సమస్యలు తలెతుత్తున్నాయి.

ప్రైవేట్ కేంద్రాలతో కుమ్మక్కు..

ఎంజీఎంలో టూడీ ఏకో సేవలు కీలకం. ఈసీజీలో ఏమైనా తేడాలు వస్తే వెంటనే టూడీ ఏకో పరీక్షలకు రెఫర్ చేస్తారు. ఈ సమయంలో ఆస్పత్రిలో టూడీ ఏకో సేవలు లేకపోవడంతో కేఎంసీలోని సూపర్ ఆస్పత్రిలో చేయించుకోవాలని రెఫర్ చేస్తారు. కేఎంసీలో మధ్యాహ్నం 12 గంటలు దాటితే సేవలు నిలిపివేస్తారు. ఈ క్రమంలో ఎంజీఎంలో టూడీ ఏకో సేవలను నిలిపివేయడంతో పేద రోగులు, ఖైదీలను రిమాండ్ పంపించే విషయంలోనూ పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో అత్యవసర రోగులు.. పోలీసు సిబ్బంది సైతం ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లి టూడీ ఎకో పరీక్షలు చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

సమస్య పరిష్కారానికి కృషి



టూడీ ఎకో సేవలు అవసరం ఉన్న వారిని కేఎంసీలోని సూపర్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నాం. వివిధ విభాగాల్లో పోర్టబెలిటీ పరికరంతో సేవలందిస్తున్నాం. రోగులకు ఇబ్బంది కలగకుండా ఎంజీఎంలోనే టూడీ ఏకో సేవలపై ఆయా విభాగాధిపతులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

- కిశోర్, సూపరింటెండెంట్, ఎంజీఎం